సాక్షి యాదాద్రి భువనగిరి

శనివారం । 21 । అక్టోబర్ । 2023



చరిత్రలో చిన్నూళ్లు..
నియోజకవర్గాల పునర్విభజనతో ఉమ్మడి జిల్లాలో కొన్ని నియోజకవర్గాలు రద్దయి కొత్తవి ఏర్పడ్డాయి. - 2లో



మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి కోరారు. - 3లో



ప్రజలంతా బీఆర్ఎస్ వైపే
అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి రాష్ట్ర ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. - 3లో

న్యూస్‌రీల్

జూలూరు వీఓఏ సస్పెన్షన్

భూదాన్‌పోచంపల్లి : మండల పరిధిలోని జూలూరు గ్రామ సంఘం వీఓఏ కేతం స్వరూపను కలెక్టర్ ఆదేశాల మేరకు విధుల నుంచి తొలగిస్తున్నట్లు డీఆర్‌డీఓ నాగిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఓఏ స్వరూప ఇటీవల గ్రామంలో ఓ రాజకీయ పార్టీ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు ఆరోపణలు వచ్చాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టాగా ప్రచారంలో పాల్గొన్నట్లు నిరూపితమైంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి జీఓ నంబర్ 58 ప్రకారం గ్రామ సంఘంలో తీర్మానం చేసి స్వరూపను విధుల నుంచి తొలగించినట్లు డీఆర్‌డీఓ తెలిపారు.

హైవేపై వాహనాల రద్దీ



చౌటుప్పల్‌లో బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్ : హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాల రద్దీ నెలకొంది. హైదరాబాద్ జంటనగరాల్లో ఉంటున్న ప్రజానీకం దసరా పండుగకు స్వస్థలాలకు తరలివెళ్తున్నారు. ఈ క్రమంలో విజయవాడ మార్గంలో ఉదయం నుంచే వాహనాలు బారులుదీరాయి. అర్ధరాత్రి వరకు రద్దీ కొనసాగింది. చౌటుప్పల్ పట్టణంలో జంక్షన్‌ల వద్ద రోడ్డు దాటేందుకు పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.

బీఆర్ఎస్, బీజేపీలకు గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న గోద శ్రీరాములు

ఆలేరురూరల్ : ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్ఎస్, బీజేపీలకు అసెంబ్లీ ఎన్నికల్లో గుణపాఠం తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. శుక్రవారం ఆలేరులో నిర్వహించిన పార్టీ ఆలేరు నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పోలీసులతో లాఠీ దెబ్బలు తిని జైలుకెళ్లిన వారు, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన వారు ఉన్నారని, బీఆర్ఎస్ సర్కార్ వారిని విస్మరించిందన్నారు. ఇప్పటికైనా ఉద్యమకారులను గుర్తించి వారి కుటుంబాలకు మూడు ఎకరాల భూమి, ఇంటి స్థలం, ప్రతి నెలా రూ.10వేల పెన్షన్ అందజేయాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో బోలగాని సత్యనారాయణ, కొల్లూరు రాజయ్య, బండి జంగమ్మ, ముత్యాలు, హరిచంద్ర, కృష్ణ, అయిలి సత్తయ్య, గోరేటి రాములు, కనకయ్య, జానకిరాములు, రాములు, వెంకటేష్, శ్రీధర్, మహేష్, మహేందర్, హేమలత తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



ఐకేపీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

రామన్నపేట: రైతులు పండించిన ధాన్యం ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు పేర్కొన్నారు. రామన్నపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యతా నాణ్యతతో కూడిన ధాన్యం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, డీఎస్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, సీవిల్ సప్లై డీఎం గోపికృష్ణ, అడిషనల్ డీఆర్‌డీ జోజప్ప, డీపీఎం సునిల్‌రెడ్డి, తహసీల్దార్ బహదూర్, ఎంపీడీఓ జలందర్‌రెడ్డి, ఏపీఎం పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

భూదాన్‌పోచంపల్లి : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార అధికారి శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం పోచంపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకొని మద్దతు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీరాభాయి, ఏఓ ఏజాజ్ అలీఖాన్, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, భువనగిరి క్లస్టర్ అధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

• యాదాద్రిలో బతుకమ్మ



యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఆలయ ఈఓ గీతారెడ్డి, భక్తులు, అధికారులు రంగురంగు పూలతో బతుకమ్మలను పేర్చి తీసుకువచ్చారు. తూర్పు రాజగోపురం ఎదుట బతుకమ్మలను ఉంచి ఆడిపాడారు. -యాదగిరిగుట్ట

పారదర్శకంగా ఎన్నికలు

- మద్యం, డబ్బు తరలించకుండా చెక్‌పోస్టులు
- బెల్టు దుకాణాలపై నిరంతర నిఘా
- 'సీ-విజిల్' ఫిర్యాదులకు వెంటనే పరిష్కారం
- ఓటింగ్ శాతం పెంచేందుకు ర్యాలీలు
- దివ్యాంగులు, 80 ఏళ్లు పైబడిన వ్యక్తులకు ఇంటి నుంచే పోస్టల్ బ్యాలెట్
- ఓటరు నమోదుకు ఈనెల 31 వరకు గడువు
- ప్రతి ఒక్కరూ ఓటెయ్యాలి

'సాక్షి' తో కలెక్టర్ హనుమంతు కె.జెండగే



సాక్షి, యాదాద్రి : అసెంబ్లీ ఎన్నికలను సజావుగా, పారదర్శకంగా నిర్వహించడానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నాం. మద్యం, నగదు అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో గత అసెంబ్లీ ఎన్నికల కంటే ఈసారి ఓటింగ్ శాతం పెంచడానికి కృషి చేస్తున్నాం. ప్రజలు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన శుక్రవారం సాక్షి ఇంటర్వ్యూలో వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే..

కోడ్ అమలు పరిశీలనకు బృందాలు

ఎన్నికల కోడ్ అమలును పరిశీలించేందుకు మూడు కమిటీలు పనిచేస్తున్నాయి. సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం భువనగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రచార రథానికి సంబంధించి సీ-విజిల్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే పరిశీలించి దాన్ని తొలగించాం. ఫిర్యాదులను పరిష్కరించడానికి సివిల్ పోలీసులు, ఇతర అధికారులు అందుబాటులో ఉన్నారు.

చెక్ పోస్టుల్లో నిఘా

ఎన్నికలు సజావుగా జరగాలంటే ప్రశాంతమైన వాతావరణం ఉండాలి. అక్రమ మద్యం, డబ్బు రవాణాను అరికట్టేందుకు సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిఘా పెట్టాం. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జిల్లా వ్యాప్తంగా బెల్టు దుకాణాలను మూసివేయించాం. ఎవరైనా బెల్టు దుకాణాల్లో మంద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు.

రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే ఆధారాలు తప్పనిసరి

ఓటర్లకు డబ్బు, మద్యం పంపిణీతో పాటు ఆభరణాలను కానుకలుగా ఇవ్వడాన్ని అడ్డుకునేందుకు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఎక్కడైనా ఎన్నికలకు సంబంధం లేనివి పట్టుబడితే అందుకు సంబంధించిన ఆధారాలు చూపించాలి. ఇందుకోసం జిల్లాలో ముగ్గురు అధికారులతో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశాం. రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్తే తప్పనిసరిగా ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో సీజ్ చేస్తాం.

రూ.31.37 లక్షలు సీజ్

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఫ్లయింగ్ స్క్వాడ్ చేపట్టిన తనిఖీల్లో రూ.13.37లక్షలు, పోలీసులు రూ.18లక్షలు సీజ్ చేశారు. 11 బాటిళ్ల లిక్కర్ స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా డబ్బు, మద్యం, ఆభరణాలు తరలించినా, ఎన్నికల విధులకు ఆటంకం కలిగించినా కఠిన చర్యలు ఉంటాయి. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక టీంలు ఉన్నాయి.

ఓటింగ్ పెంచడమే లక్ష్యం

2018 ఎన్నికల్లో ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో 90 శాతానికి పైగా ఓట్లు పోలయ్యాయి. ఈసారి గతంలో కంటే పోలింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అందుకోసం ఓటర్లలో అత్యధికంగా ఉన్న యువత ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. గత ఎన్నికల్లో భువనగిరి నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైంది. ఆయా కేంద్రాల పరిధిలో పోలింగ్ శాతం పెంచే బాధ్యతలను భువనగిరి మున్సిపల్ కమిషనర్‌కు అప్పగించాం.

దివ్యాంగులు, 80 ఏళ్లు దాటిన వ్యక్తులు ఇంటి నుంచే..

దివ్యాంగులు, 80 సంవత్సరాల వయస్సు దాటిన వృద్ధులతో పాటు ఎన్నికల విధుల్లో పాల్గొనే 13 విభాగాల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఇస్తున్నాం. ఇందుకోసం ఫారం -12 డీ దరఖాస్తులను పంపిణీ చేస్తున్నాం. ప్రిసైడింగ్ అధికారుల బృందం దివ్యాంగులు, వృద్ధుల ఇళ్లకు వెళ్లి వారికి పోస్టల్ బ్యాలెట్‌ను అందజేస్తారు. రహస్యంగా ఓటు వేసే విధంగా ఇళ్లలోనే కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేస్తారు. పార్టీ ఏజెంటు, కెమెరాలు, పోలీసు బందోబస్తు మధ్యన ఓటు వేయవచ్చు. ఓటు వేసిన తర్వాత ఓటరే స్వయంగా సీల్ వేసి ప్రిసైడింగ్ అధికారికి ఇస్తారు.

నవంబర్ 15 లోగా గుర్తింపు కార్డులు

కొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి ఈనెల 31వరకు అవకాశం ఉంది. ఫారం-6, బదిలీ, సవరణకు ఫారం - 8ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. నవంబర్ 10న నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుంది. అనంతరం అనుబంధ ఓటరు జాబితా ప్రకటిస్తాం. ఇప్పటికే అక్టోబర్ 4న తుది జాబితా విడుదల చేశాం. నవంబర్ 15వ తేదీ లోగా కొత్త ఓటర్లందరికీ గుర్తింపు కార్డులను వారి అడ్రస్‌లకు పంపిస్తాం.

ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి

- తొలి విడతలో ఈవీఎంలు 25 శాతం అధికంగా కేటాయింపు
- పరిశీలించిన కలెక్టర్ హనుమంతు కె.జెండగే
- హాజరైన రాజకీయ పార్టీల ప్రతినిధులు



బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల కేటాయింపును వివరిస్తున్న అధికారులు

సాక్షియాదాద్రి : అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈవీఎంల ర్యాండమైజేషన్‌ను వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో నిర్వహించారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాలకు సంబంధించి బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌ల కేటాయింపు పూర్తయినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే తెలిపారు. తొలి విడతలో 25శాతం అధికంగా బ్యాలెట్, కంట్రోల్ యూనిట్‌లు, వీవీ ప్యాట్లు కేటాయించినట్లు చెప్పారు.

నియోజకవర్గాల వారీగా కేటాయించినవి..
ఎన్నికల నిర్వహణకు భువనగిరి నియోజకవర్గంలో 257 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అందుకు అనుగుణంగా 321 బ్యాలెట్ యూనిట్‌లు, 321 కంట్రోల్ యూనిట్‌లు, 359 వీవీ ప్యాట్‌లను కేటాయించారు. ఆలేరు నియోజకవర్గంలో 309 పోలింగ్ కేంద్రాల ఉండగా 386 బ్యాలెట్ యూనిట్‌లు, 386 కంట్రోల్ యూనిట్‌లు, 432 వీవీ ప్యాట్‌లను కేటాయించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ర్యాండమైజేషన్ పక్కాగా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటర్నరింగ్ అధికారులు వీరారెడ్డి, భాస్కర్‌రావు, అమరేందర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అదనపు సిబ్బందిని సిద్ధంగా ఉంచాలి
ఎన్నికలకు విధులకు ప్రస్తుతం కేటాయించిన సిబ్బందినే కాకుండా అదనంగా మరికొందరిని సిద్ధంగా ఉంచుకోవాలని రాష్ట్ర ఎన్నికల అడిషనల్ సెక్రటరీ లోకేష్‌కుమార్ సూచించారు. శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు కేటాయించిన సిబ్బందికి విధుల కేటాయింపు, శిక్షణ తదితర అంశాలపై సమీక్షించారు. సిబ్బందికి బాధ్యతలు, కేటాయించిన ప్రదేశాలు సూచించాలన్నారు.

మహిళలకు ఆరోగ్య రక్ష !

- క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలకు కసరత్తు
- త్వరలో ఇంటింటి సర్వే
- సిబ్బందికి శిక్షణ పూర్తి



సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారి

భువనగిరి : మహిళలకు ఇంటి వద్దే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం వైద్యారోగ్య శాఖ కసరత్తు ప్రారంభించింది. ఎన్‌సీడీ(నాన్ కమ్యునికేబుల్ డిసీజెస్) కార్యక్రమంలో భాగంగా పరీక్షలు చేయనున్నారు. రొమ్ము, గర్భాశయ, నోటి క్యాన్సర్ బాధపడే మహిళలు ఉన్నారు. ఇప్పటికే ఎన్‌సీడీ రెండుసార్లు సర్వే చేసి బీపీ, షుగర్, పరీక్షలు నిర్వహించింది. తాజాగా ఇంటింటికి వెళ్లి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయనున్నారు. 21 సంవత్సరాల వయస్సు పై బడిన వారికి వీఐఏ (విజువల్ ఇన్‌స్పెక్షన్ విత్ అసిటిక్ యాసిడ్) ద్వారా వైద్య పరీక్షలు చేస్తారు. ఇందుకు సంబంధించి వైద్యులు, స్టాఫ్‌నర్స్‌లు నెలరోజుల క్రితమే శిక్షణ పొందారు. వీరు జిల్లాలోని ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కేవలం మహిళా సిబ్బంది మాత్రమే ఇంటింటికి వెళ్లి సర్వే చేయనున్నారు.

ఆస్పత్రులు ఇలా..
జిల్లాలో 143 ఆరోగ్య ఉప కేంద్రాలు, 21 ఆరోగ్య కేంద్రాలు, మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఒక జిల్లా కేంద్ర ఆస్పత్రి ఉంది. ఆరోగ్య ఉపకేంద్రాల సిబ్బంది సర్వే చేసి అనుమానితులు ఉంటే నిర్ధారణ కోసం పీహెచ్‌సీ లేదా జిల్లా కేంద్ర ఆస్పత్రికి పంపనున్నారు. క్యాన్సర్ నిర్ధారణ జరిగితే వారికి చికిత్సతో పాటు ఉచితంగా మందులు అందించనున్నారు.

ఇప్పటికే ఆరోగ్య మహిళా క్లినిక్ ద్వారా పరీక్షలు
జిల్లాలో ఇప్పటికే ఆరోగ్య మహిళా క్లినిక్ ద్వారా ప్రతి మంగళవారం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి, యాదగిరిగుట్ట, సంస్థాన్‌నారాయణపురం, వలిగొండ, గుండాల మండల కేంద్రాల్లో ఆరోగ్య మహిళా క్లినిక్‌లు ఉన్నాయి. గుండలలో 6, బీబీనగర్ క్లినిక్ పరిధిలోని ఎనిమిది మందికి కేన్సర్ ఉన్నట్లు నిర్ధారించారు.

రోజూ 30 మంది మహిళలకు పరీక్షలు

ఒక్కో ఏఎన్ఎం రోజూ 30 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేయనున్నారు. వారానికి నాలుగు రోజులు సర్వే కొనసాగనుంది. సర్వే చేసేందుకు వైద్యారోగ్య శాఖ తయారు చేసిన ప్రశ్నల ప్రకారం అనుమానితుల నుంచి సమాధానాలు రాబడుతారు. వీటిని కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయనున్నారు. సమాధానాలను బట్టి స్కోర్ 3 లేదా అంతకంటే ఎక్కువ వస్తే అనుమానితులుగా భావించి పరీక్ష చేస్తారు.

క్యాన్సర్‌ను నిర్మూలించేందుకే టెస్టులు



ఎన్‌సీడీ ద్వారా ఇంటింటి సర్వే చేపట్టనున్నాం. సర్వేలో పాల్గొనే సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చాం. ఇప్పటికే ఆరోగ్య మహిళా క్లినిక్‌ల ద్వారా మహిళలకు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమం క్యాన్సర్ రహిత సమాజ స్థాపనకు దోహదపడుతుంది. సర్వే చేయడానికి వచ్చే సిబ్బందికి మహిళలు సహకరించాలి.

– డాక్టర్ పరిపూర్ణాచారి, డీఎంహెచ్ఓ

రెండు పార్టీల్లో చేరికల జోష్..



మంత్రి కేటీఆర్‌కు శాలువా కప్పి సన్మానిస్తున్న జిట్టా బాలకృష్ణారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

- ఆకర్ష్‌కు పదునుపెట్టిన బీఆర్ఎస్
- ఇతర పార్టీల్లోని అసంతృప్తులు, ద్వితీయ శ్రేణి నాయకత్వంపై దృష్టి
- కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి 'జిట్టా'
- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పలువురు

సాక్షి, యాదాద్రి : అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీలు తమ బలాన్ని, బలగాన్ని పెంచుకుంటున్నాయి. ఇందులో భాగంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ మరోమారు ఆకర్ష్‌కు తెరలేపాయి. ఇరు పార్టీలు అసంతృప్త నేతలు, ద్వితీయ శ్రేణి నాయకత్వం, యువత, విద్యార్థి, కార్మిక విభాగాలపై దృష్టి సారించాయి. హామీలు ఇస్తూ వారిని తమ పార్టీలోకి రప్పిస్తున్నాయి. భువనగిరి నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం సందర్భంగా ఇతర పార్టీల నుంచి పెద్ద ఎత్తున గులాబీ గూటికి చేరుతున్నారు. శుక్రవారం కాంగ్రెస్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డి తన అనుచరులతో కలిసి ప్రగతిభవన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మరికొందరు గులాబీ కండువా కప్పుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఇక కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇతర పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ కండువాలు కప్పుకుంటున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇతర పార్టీలకు చెందిన ముఖ్య నేతలను పెద్ద సంఖ్యలో పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు.

ఆలేరులో నియోజకవర్గంలో..
ఎమ్మెల్యే గొంగిడి సునీత సమక్షంలో కొంతకాలంగా బీఆర్ఎస్ పార్టీలోకి పెద్ద ఎత్తున వలసలు కొనసాగుతున్నాయి. ఇక కాంగ్రెస్ టికెట్ బీర్ల అయిలయ్యకు ప్రకటించడంతో చేరికలు ఊపందుకున్నాయి. రెండు రోజుల క్రితం ఆలేరు మున్సిపాలిటీ స్వతంత్ర్య అభ్యర్థి గుత్త శమంతారెడ్డి, బీజేపీ కౌన్సిలర్ సంగుభూపతితో పాటు మరికొందరు కాంగ్రెస్‌లో చేరారు. బొమ్మలరామారం, తుర్కపల్లి, ఆత్మకూరు(ఎం), మోటకొండూరు రాజాపేట, యాదగిరిగుట్ట మండలాల్లో బీఆర్ఎస్‌కు ధీటుగా ఆకర్ష్‌కు తెరలేపారు.

అసంతృప్తిలో ద్వితీయ శ్రేణి

అన్ని పార్టీల్లోనూ ద్వితీయ శ్రేణి నాయకత్వం అసంతృప్తితో ఉంది. బీఆర్ఎస్‌లో ఉద్యమ కాలం నుంచి పార్టీకి పని చేస్తున్న వారు తమకు ఏ పదవులు రాలేదన్న నిరాశలో ఉన్నారు. పార్టీ ఇచ్చిన హామీలు కూడా నెరవేరకపోవడంతో కాంగ్రెస్‌లో చేరిపోతున్నారు. ఇక కాంగ్రెస్‌లో కూడా సంస్థాగత పదవులు దక్కనివారితో పాటు మరికొందరు అసంతృప్తులు పార్టీని వీడుతున్నారు. అయితే టికెట్ కోసం ప్రయత్నిస్తున్న నేతలు వేచిచూసే ధోరణిలో ఉన్నారు.

సీఎం సభను జయప్రదం చేయాలి

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



విప్ గొంగిడి సునీతను సన్మానిస్తున్న కార్యకర్తలు

బొమ్మలరామారం : ఆలేరులో ఈనెల 29న నిర్వహించే ప్రజా ఆశీ ర్వాద సభకు సీఎం కేసీఆర్ రానున్నారని, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం బొమ్మలరామారం మండలంలోని చీకటిమామిడిలో మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌తో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీని ప్రజలు గుండెల్లో పెట్టుకొని కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా ఆలేరు గడ్డపై మళ్లీ గులాబీ జెండా ఎగురబోతుందన్నారు. సమష్టి కృషితో హ్యాట్రిక్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి, నాయకులు మచ్చ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుషంగల సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ గూదే బాల్ నర్సింహ, సర్పంచ్ మచ్చ వసంతా శ్రీనివా స్ గౌడ్, వైస్ ఎంపీపీ శోభ చంద్రమౌళి, మండల పార్టీ అధ్యక్షులు పోలగౌని వెంకటేష్‌గౌడ్, కొండోజు అంజనేయులు, మేడబోయిన గణేష్, నవీన్, రాజన్ పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్‌లోకి 'చెరుకు'

నల్లగొండ : నకిరేకల్ నియోజకవర్గానికి చెందిన డాక్టర్ చెరుకు సుధాకర్ శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు, గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సమక్షంలో ఆయన గులాబీ కండువా వేసుకోనున్నారు. వృత్తి పరంగా వైద్యుడైన చెరుకు సుధాకర్ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో కీలకంగా పనిచేశారు. పీడీ యాక్టు కింద కేసు పెట్టి జైలుకు పంపినా ఉద్యమాన్ని వదల లేదు. కేసీఆర్ 2001 తెలంగాణ రాష్ట్ర సమితిని స్థాపించగా.. చెరుకు సుధాకర్ 2003లో చేరారు. అయితే, రాజకీయ పరిణామాలతో ఆయన 2014లో టీఆర్ఎస్‌ను వీడారు. కొంత కాలం తెలంగాణ ఉద్యమ వేదికలో పనిచేశారు.

• సరస్వతీదేవిగా..



యాదాద్రికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. అమ్మవారికి అభిషేకం, మూల నక్షత్ర పూజలు, సహస్ర నామార్చన, లక్ష కుంకుమార్చన తదితర పూజలు చేశారు. - యాదగిరిగుట్ట


మెరుగైన సేవలతో ఖాతాదారుల మన్ననలు



యూనియన్ బ్యాంక్ నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఈఓ గీతారెడ్డి, సీజీఎం భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి వారి మన్ననలు పొందాలని యాదాద్రి దేవస్థానం ఈఓ గీతారెడ్డి, బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ భాస్కర్‌రావు, రీజినల్ హెడ్ సత్యం పలుగుల్ల పేర్కొన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను కొత్త గుండ్లపల్లికి మార్చారు. శుక్రవారం నూతన కార్యాలయంలో పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖాతాదారులు బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూనియన్ బ్యాంకుకు యాదగిరిగుట్ట పట్టణంలో మంచి ఖాతాదారులున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎం నాగరాజు, అసిస్టెంట్ మేనేజర్ సత్తయ్య, క్యాషియర్లు సరేష్, ఇంద్రజా, సురేష్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో మొదటి ఓటరు ఈమే..



మాల్ వ్యూ


పల్లేటి మాధవి

చింతపల్లి : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అసెంబ్లీ నియోజకవర్గాల సీరియల్ నంబర్లు దేవరకొండ నుంచి ప్రారంభమవుతాయి. ప్రతి శాసనసభ నియోజకవర్గానికి, పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక కోడ్ ఉంటుంది. సీరియల్ నంబర్ అదే.. కోడ్ కూడా అదే. రాష్ట్రంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గం మొదటిది. ఆ నియోజకవర్గం కోడ్ నంబర్ 1. చివరి నియోజకవర్గంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం . దాని కోడ్ 119. ఇలా రాష్ట్రంలోని మొత్తం 119 నియోజకవర్గాలకు కోడ్ ఉంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దేవరకొండ నియోజకవర్గం మొదటిది. ఆ నియోజకవర్గం కోడ్ 86. ఆ తర్వాత నాగార్జునసాగర్(87), మిర్యాలగూడ(88), హుజూర్‌నగర్(89), కోదాడ(90), సూర్యాపేట(91), నల్లగొండ(92), మునుగోడు(93), భువనగిరి(94), నకిరేకల్(95), తుంగతుర్తి(96), ఆలేరు(97) ఉన్నాయి.

మాల్ వెంకటేశ్వరనగర్‌లో మొదటి ఓటరు

మన ఉమ్మడి జిల్లాలో మొదటిదైన దేవరకొండ నియోజకవర్గంలో మొదటి పోలింగ్ కేంద్రం మాల్ వెంకటేశ్వర్‌నగర్ నుంచి మొదలవుతుంది. ఓటరు జాబితా ప్రకారం ఆ పోలింగ్ కేంద్రంలో మొదటి ఓటరు పల్లేటి మాధవి. ఈమెనే ఉమ్మడి నల్లగొండ జిల్లా మొదటి ఓటరు. తాను మొదటి ఓటరు అని చెప్పుకోవడం కొత్త అనుభూతిని ఇస్తోందని చెబుతున్నారు మాధవి.

జంగ్ తెలంగాణ


మిషన్ కుడతా.. ఓట్లు పడతా.. నల్లగొండలో కుట్టుమిషన్ కుడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


కాంగ్రెస్‌లోకి ఆహ్వానం.. మునగాల : మాధవరంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పద్మావతి


ఇదీ మా మేనిఫెస్టో.. నకిరేకల్‌లో మేనిఫెస్టో చూపిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన


సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అపూర్వరావు

మునుగోడు : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఈనెల 26న నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచార సభా స్థలాన్ని ఎస్పీ అపూర్వరావు శుక్రవారం పరిశీలించారు. హెలీప్యాడ్, వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించి స్థానిక సీఐ, ఎస్‌ఐలకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. సభకు ఒకరోజు ముందుగానే పోలీస్ భారీ బందోబస్త్ వస్తుందని, సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించేలా చూడాలన్నారు. గ్రామాల్లో బెల్టు దుకాణాల ద్వారా మద్యం విక్రయించకుండా పూర్తిగా నియంత్రించాలన్నారు. ఆమె వెంట నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, చండూరు సీఐ వెంకటయ్య, ఎస్‌ఐ సీహెచ్.వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

అనుచిత కామెంట్లు చేస్తే కేసులే..

- వాట్సప్ గ్రూపులు, ఇతరత్రా సోషల్ మీడియా యాప్‌లపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక నిఘా
- రెచ్చగొట్టేలా పార్టీలు, నాయకులపై పోస్టులు, కామెంట్లు పెడితే చర్యలు



సూర్యాపేట: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాపై ఎన్నికల సంఘం ప్రత్యేక నిఘా పెట్టింది. వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం, ఎక్స్(ట్విట్టర్) తదితర సోషల్ మీడియా గ్రూపుల్లో ఆయా పార్టీలకు వ్యతిరేకంగా అనుచిత పోస్టులు పెట్టినా, నాయకులను కించపరుస్తూ వారి మనోభావాలను దెబ్బతీసేలా కామెంట్ చేసినా, అవహేళన చేస్తూ వీడియో క్లిప్‌లు పోస్టు చేసినా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలీసులు కేసులు నమోదు చేయడానికి సిద్ధమవుతున్నారు.

యువత అప్రమత్తంగా ఉండాల్సిందే..

తమకు ఉద్యోగం రాలేదనే నిరుత్సాహంతో పార్టీలు, నాయకులపై సోషల్ మీడియాలో యువత, నిరుద్యోగులు అనుచిత పోస్టులు పెడితే వారి భవిష్యత్‌కే ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. ఆయా గ్రూపుల అడ్మిన్లతో పాటు పోస్టు పెట్టిన వారిపై పోలీసులు పెట్టే కేసుల ప్రభావంతో భవిష్యత్తులో ప్రభుత్వ, ఇతరత్రా ఉద్యోగాలకు సైతం దూరమయ్యే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో యువత, నిరుద్యోగులు అప్రమత్తంగా ఉండాలి.

గ్రూపు అడ్మిన్‌లే బాధ్యత వహించాలి



సోషల్ మీడియాలో ప్రజలను, వివిధ పార్టీలకు చెందిన నాయకులను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టినా.. వాటికి అనుచిత కామెంట్లు చేసినా కేసులు నమోదు చేస్తాం. దీనికి పూర్తిగా ఆయా గ్రూపుల అడ్మిన్‌లే బాధ్యత వహిస్తారు. సోషల్ మీడియా పోస్టులపై ప్రత్యేక బృందాలతో పర్యవేక్షిస్తున్నాం. – రాహుల్ హెగ్డే, ఎస్పీ, సూర్యాపేట

చరిత్రలో చిన్నూళ్లు..


- నాడు నియోజకవర్గ కేంద్రాలు.. నేడు సాధారణ పంచాయతీలు
- పునర్విభజన ఫలితంగా మారిన ముఖచిత్రం

1952 తొలి ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలో 9 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. పలుమార్లు నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో కొన్ని నియోజకవర్గాలు రద్దయి కొత్తవి ఏర్పడ్డాయి. వాటిలో చిన్నకొండూరు, పెద్దమునిగల్, పెద్దవూర, నాగారం, హుజూర్‌నగర్ గ్రామాలు ఆనాడు నియోజకవర్గ కేంద్రాలుగా ఉన్నాయి. హుజూర్‌నగర్ రద్దయినా 2009లో జరిగిన నియోజవర్గాల పునర్విభజన సమయంలో మళ్లీ ఏర్పాటైంది.

– చౌటుప్పల్, పెద్దవూర

గతమెంతో ఘనం.. నేడు చిన్న గ్రామం

1952లో చౌటుప్పల్ మండలంలోని చిన్నకొండూర్ నియోజకవర్గ కేంద్రంగా ఉండేది. 1952, 1957, 1962లో సాధారణ ఎన్నికలు జరిగాయి. 1952 ఎన్నికల్లో కె.వెంకటరామారావు, 1962 ఎన్నికల్లో కె.గురునాథ్‌రెడ్డి విజయం సాధించారు. 1957 సాధారణ, 1965లో జరిగిన ఉప ఎన్నికలో ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ ఇక్కడి నుంచే పోటీ చేసి విజయం సాధించారు. ఆయన శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా వ్యవహరించారు. 1967 నియోజకవర్గాల పునర్విభజనలో చిన్నకొండూర్ రద్దయ్యింది. మునుగోడు కేంద్రంగా నియోజకవర్గం ఏర్పడింది. చౌటుప్పల్ మండలం భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో చేరింది. ప్రస్తుతం చిన్నకొండూరు గ్రామ జనాభా 2,629 ఉండగా ఓటర్లు 2,013 మంది ఉన్నారు.


చిన్నకొండూరు గ్రామ వ్యూ


పెద్దవూర వ్యూ



చలకుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయం

పెద్దవూర టు నాగార్జునసాగర్ వయా చలకుర్తి

1962లో పెద్దవూర నియోజకవర్గంగా ఏర్పాటైంది. 1962లో జరిగిన ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి పి.పర్వతరెడ్డి ఇక్కడ గెలుపొందారు. ఈ ఒక్క ఎన్నిక వరకే పెద్దవూర పరిమితమైంది. 1967లో జరిగిన నియోజవర్గాల పునర్విభజనలో పెద్దవూర నియోజకవర్గాన్ని రద్దు చేసి చలకుర్తి గ్రామం పేరుతో నియోజకవర్గం ఏర్పాటు చేశారు. చలకుర్తి నియోజకవర్గంలో పెద్దవూర, అనుముల, నిడమనూరు, త్రిపురారం, దామరచర్ల మండలాలు ఉండేవి. చలకుర్తి నియోజకవర్గ కేంద్రంగా ఉన్నప్పటికి ఎలాంటి అభివృద్ధి జరగలేదు. ఇప్పటికి గ్రామ పంచాయతీగానే ఉంది. చలకుర్తి క్యాంపులో 1986లో జవహర్ నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో చలకుర్తిని రద్దు చేసి నాగార్జునసాగర్ నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. పెద్దవూర, చలకుర్తి, నాగార్జునసాగర్ నియోజకవర్గాల పేరుతో ఉప ఎన్నికతో కలిపి మొత్తం 14 పర్యాయాలు ఎన్నికలు జరిగాయి.


నాగారం గ్రామ వ్యూ

నాగారం టు తుంగతుర్తి

1962లో నాగారం నియోజకవర్గం ఏర్పాటైంది. అప్పుడు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎ.రంగారెడ్డి, సీపీఐ అభ్యర్థి బీఎస్.రెడ్డిపై 102 ఓట్ల స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. ఈ ఒక్క ఎన్నిక తర్వాత ఈ నియోజకవర్గం రద్దయింది. 1967లో తుంగతుర్తి నియోజకవర్గం ఏర్పాటైంది.

పెద్దమునగాల..

1952లో పెద్దమునగాల నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటైంది. తొలి ఎన్నికల్లో ఇక్కడి నుంచి పీడీఎఫ్ అభ్యర్థి వెంకటరామారావు విజయం సాధించారు. ఆయన రాజీనామా చేయడంతో అదే సంవత్సరంలో ఉప ఎన్నిక జరిగింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కెవి.రామారావు గెలుపొందారు. 1957 పెద్దమునగాల రద్దయి మిర్యాలగూడ నియోజకవర్గం ఏర్పాటైంది.

మళ్లీ హుజూర్‌నగర్..

1952లో హుజూర్‌నగర్ ద్విసభ నియోజకవర్గంగా ఉండేది. తొలిసారి జరిగిన ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులు జయసూర్య, నర్సింహులు ఎన్నికయ్యారు. జయసూర్య ఎంపీగా కూడా ఎన్నిక కావడంతో ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు. దీంతో జరిగిన ఉప ఎన్నికల్లో ఉర్దూ కవి మగ్దూం మోహియొనుద్దీన్ పీడీఎఫ్ తరఫున విజయం సాధించారు. 1957లో జరిగిన ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి దొడ్డా నరసయ్య, 1962, 1967లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అక్కిరాజు వాసుదేవరావు గెలుపొందారు. 1972లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర్య అభ్యర్థి జితేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు. 1978లో హుజూర్‌నగర్ నియోజకర్గం రద్దయి.. కోదాడ కేంద్రంగా నియోజకవర్గం ఏర్పాటైంది. తర్వాత 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో హుజూర్‌నగర్ మళ్లీ నియోజకవర్గంగా ఏర్పాటైంది.

నాలుగు భాగాలైన రామన్నపేట

రామన్నపేట : నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో రామన్నపేట అసెంబ్లీ నియోజకవర్గం రద్దయింది. ఈ నియోజకవర్గంలోని ఐదు మండలాలను విడదీసి నాలుగు వేర్వేరు నియోజకవర్గాల్లో కలిపారు. నియోజకవర్గ కేంద్రమైన రామన్నపేటను నకిరేకల్‌లో వలిగొండను భువనగిరిలో, ఉమ్మడి మోత్కూరును తుంగతుర్తిలో, ఆత్మకూరు (ఎం), గుండాల మండలాలను ఆలేరు నియోజకవర్గంలో విలీనం చేశారు.

కాంగ్రెస్, కమ్యూనిస్టుల పోటాపోటీ..

1967లో ఏర్పాటైన రామన్నపేట అసెంబ్లీ నియోజకవర్గానికి 11సార్లు ఎన్నికలు జరుగగా ఆరు సార్లు కాంగ్రెస్, నాలుగు సార్లు సీపీఐ, ఒకసారి పీడీఎఫ్ అభ్యర్థి విజయం సాధించారు. 1985, 1989, 1994లలో సీపీఐ అభ్యర్థి గుర్రం యాదగిరిరెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించారు. 1957, 1962లలో కట్కూరి రామచంద్రారెడ్డి వరుసగా రెండు పర్యాయాలు, 1967, 1972లలో కాంగ్రెస్ అభ్యర్థి వడ్డేపల్లి కాశీరాం, 1978, 1983లలో కాంగ్రెస్ అభ్యర్థి కొమ్ము పాపయ్య, 1999, 2004లలో కాంగ్రెస్ అభ్యర్థి ఉప్పునూతల పురుషోత్తంరెడ్డి వరుస విజయాలను సాధించారు. 1983లో కాంగ్రెస్‌పార్టీ నుంచి గెలుపొందిన కొమ్ము పాపయ్య టి.అంజయ్య మంత్రివర్గంలో విద్యుత్‌శాఖ మంత్రిగా పనిచేశారు. 1963లో ఎమ్మెల్సీగా ఎన్నికైన ఉప్పునూతల పురుషోత్తంరెడ్డి జలగం వెంగళరావు మంత్రివర్గంలో ఎక్సైజ్‌శాఖా మంత్రిగా పని చేశారు. 2004లో రెండవసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఉప్పునూతల పురుషోత్తంరెడ్డి తాను ముఖ్యమంత్రి రేసులో ఉన్నానని సంచలన ప్రకటనచేసి వార్తల్లోకెక్కారు.

రైల్వేస్టేషన్‌లో రూ.5.80లక్షలు పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ నర్సింహులు

మిర్యాలగూడ టౌన్ : ఎన్నికల్లో భాగంగా పోలీసులు, రైల్వే పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. శుక్రవారం పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో రూ.5.80లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులు, రైల్వే ఏఎస్‌ఐ హుస్సెన్ తెలిపారు. వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన బి.వెంకట్‌రెడ్డి రైల్వే కాంట్రాక్టర్‌గా పని చేస్తున్నాడు. ఆయన దాచేపల్లి నుంచి మిర్యాలగూడకు రైలులో వచ్చాడు. ఎన్నికల్లో భాగంగా రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేపడుతుండగా వెంకట్‌రెడ్డి వద్ద రూ.5లక్షల 80వేల నగదు పట్టుబడినట్లు వారు వెల్లడించారు. నగదుకు సంబంధించి ఏలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును జిల్లా ట్రెజరరీకి అప్పగించినట్లు ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

రూ.లక్ష నగదు పట్టివేత

కోదాడరూరల్ : ఎన్నిల నేపథ్యంలో కోదాడ మండల పరిధిలోని రామాపురం క్రాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద రూ.లక్ష నగదు పట్టుబడినట్లు రూరల్ ఎస్‌ఐ సాయిప్రశాంత్ శుక్రవారం తెలిపారు. ఏపీలోని గుంటూరుకు చెందిన ఓ వ్యక్తి కారులో నగదు తీసుకెళ్తుండగా తనిఖీల్లో పట్టుబడినట్లు తెలిపారు. అదేవిధంగా ఖమ్మం జిల్లా మధిరకు చెందిన దుప్పట్ల వ్యాపారి కర్ణాటకకు దుప్పట్లను తరలిస్తుండగా చెక్‌పోస్టులో పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మిచెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శుక్రవారం విశేషంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకార్చనలు, నిత్యహోమం, మూలవిరాట్‌మూర్తికి పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అదేవిధంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, కళ్యాణం జరిపించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ విధానాన్ని రద్దుచేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్న

హుజూర్‌నగర్ : కార్మికుల కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన ఐక్య కార్మిక సంఘాల పార్ బాయిల్డ్ రైస్‌మిల్లు డ్రైవర్స్ (ఐఎన్‌టీయూసీ, బీఆర్‌టీయూ, సీఐటీయూ) యూనియన్ జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైస్‌మిల్లుల్లో కార్మికుల కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలని 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని యాజమాన్యాలను కోరారు. రెండేళ్లకు జరిగే ఒప్పందం ప్రకారం నడుచుకోవాలని, 12 గంటల పని విధానాన్ని అమలు ప్రయత్నం చేయవద్దని ఆయన కోరారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు ఉపేందర్, శీలం శ్రీను, గురవయ్య, జానయ్య, సైదులు, కోటేశ్వరరావు, మల్లయ్య, రామరాజు, రాము, తిరపతయ్య, వీరబాబు, పర్వతాలు, సుబ్బారావు, వెంకన్న, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ.. తప్పిన ప్రమాదం


కారును ఢీకొట్టిన లారీ

మాడుగులపల్లి : అతివేగంగా వెళ్తున్న ఓ లారీ అదుపుతప్పి కారును ఢీకొట్టింది. ఈ ఘటన మండల కేంద్ర శివారులోని టోల్‌ప్లాజా వద్ద అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడకు చెందిన ముడుంబై రామానుజాచార్యులు భార్య మంగతాయారుతో కలిసి కారులో హైదరాబాద్ బయల్దేరాడు. వారు మాడుగులపల్లి టోల్‌ప్లాజా సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి వస్తున్న ఓ లారీ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు పాక్షికంగా ధ్వంసమైంది. అందులో ప్రయాణిస్తున్న భార్యభర్తలకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. ఇదే సమయంలో హైదరాబాద్ నుంచి మిర్యాలగూడకు వెళ్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు తన కారును నిలిపి ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పోలీసులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామానుజాచార్యుల దంపతులను పరామర్శించారు. రామానుజాచార్యులు స్నేహితుడు అనంతరెడ్డి ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు.

పత్తి, మిరప సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

పెన్‌పహాడ్ : రైతులు పత్తి, మిరప పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక లాభాలు పొందవచ్చని కేవీకే శాస్త్రవేత్తలు ఎ.కిరణ్, సీహెచ్.నరేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని మహ్మదాపురం గ్రామంలో సాగవుతున్న పత్తి, మిరప, వేరుశనగ పంటలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడారు. మొక్క పెరుగుదల బట్టి నత్రజని ఎరువులను అందించడం లాభదాయకంగా ఉంటుందన్నారు. వేరుశనగ పంటలు తగిన యాజమాన్య పద్ధతులతో చేసుకోవాలని, 40రోజుల తర్వాత పూత దశలో జిప్సం వాడాలన్నారు. మిరప పంటలో ఆశించిన తామర పురుగు, నల్లి నివారణకు జీవ నియంత్రణ శిలీంద్రాలైన బవేరియా, బాసియానా, వర్టిసీలియమ్ లెకాని 5మి.లీ నీటిలో వేపనూనెతో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. దీంతో పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చని తెలిపారు. వారి వెంట కేవీకే ప్రోగ్రాం అసిస్టెంట్ ఎ.నరేష్, రైతులు మామిడి సురేష్, సైదులు, పాపమ్మ, ప్రవీణ్, నగేష్ తదితరులు ఉన్నారు.

దళితుల జనాభా ప్రకారం నిధులు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): దళితుల జనాభా దామాషా ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీల ఆధ్వర్యంలో రాజ్యాంగం, రిజర్వేషన్ల రక్షణ, దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ ఏర్పాటు, దళితులపై జరుగుతున్న దాడులు, హత్యలు అరికట్టడం వంటి పలు అంశాలపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం భూమిలేని దళిత కుటుంబాలను గుర్తించి మూడెకరాల చొప్పున పంపిణీ చేయాలన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ప్రైవేట్ విద్య, వైద్య సంస్థల్లో ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టాలు తేవాలన్నారు. సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ రెమిడాల రాజు, వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపెల్లి సైదులు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి, బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ్ల ధనుంజయ నాయుడు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 25వరకు మార్కెట్ యార్డుకు సెలవు

తిరుమలగిరి (తుంగతుర్తి): దసరా పండుగను పురస్కరించుకొని తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమ్మినేని స్రవంతిసతీష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 నుంచి మార్కెట్ యథావిధిగా నడుస్తుందని పేర్కొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్‌పై విచారణ


విచారణ చేస్తున్న జిల్లా మలేరియా అధికారి సాహితి

పెన్‌పహాడ్ : ల్యాబ్ టెక్నీషియన్ విధులకు హాజరు కాకుండానే వేతనం పొందడంపై మండల పరిధిలోని పీహెచ్‌సీలో జిల్లా మలేరియా అధికారి సాహితి విచారణ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ సత్యనారాయణ విధులు నిర్వహించకుండా 11 నెలల వేతనం స్వాహా చేశాడని కలెక్టర్‌కు శ్రీధర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి స్రవంతి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న నరమేదాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాలని, పాలస్తీనా ప్రజలకు అండగా నిలవాలని సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమెరికా అండ చూసుకుని ఇజ్రాయెల్ పాలస్తీనా మీద దుర్మార్గపు దాడులు చేస్తుందని ఆరోపించారు. ఇజ్రాయెల్ దాడులు ఆపాలని, ఐక్యరాజ్య సమితి తీర్మానాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా రాంజీ, ఆటో యూనియన్ జిల్లా కన్వీనర్ గోగుల వీరబాబు, శ్రీకాంత్, వెంకటమ్మ, సుగుణమ్మ, మరియమ్మ, రాంబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న నాయకులు